శంకరయ్య క్షమాపణ చెప్పాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యేకు వెలమల హెచ్చరిక • బాలసముద్రంలో ధర్నా, వీర్లపల్లి దిష్టిబొమ్మ దహనం

హనుమకొండ, డిసెంబర్ 9: తమ జోలి కొస్తే ఊరుకునేదిలేదని వెలమ సంక్షేమ సంఘం నాయకులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యను హెచ్చరించారు. సోమవారం ఎమ్మెల్యే శంకరయ్య వెలమలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలాపార్కు ఎదుట ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి ఎమ్మెల్యే శంకరయ్య దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రావు, ఉషాదయాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను తిడితే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే శంకరయ్య క్షమాపణ చెప్పకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు బోయినపల్లి రంజిత్‌రావు, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, కేశవరావు, వెంకటేశ్వర్‌రావు, దుర్గారావు, ఉపేందర్‌రావు, దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వెలమ సంఘం నాయకులు

మంచు కుటుంబంలో ముదిరిన వివాదం

- మోహన్‌బాబు, మనోజ్ మధ్య తీవ్రమైన విభేదాలు
- పోలీసులను ఆశ్రయించిన మోహన్‌బాబు, మనోజ్
- ప్రాణహాని ఉందంటూ తండ్రీ కొడుకుల ఫిర్యాదులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): మంచు కుటుంబంలో విభేదాలు తారస్థాయి చేరుకున్నాయి. తన కొడుకు, కోడలు నుంచి ప్రాణహాని ఉందంటూ మోహన్‌బాబు రాచకొండ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే తన తండ్రి అనుచరుల నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ మంచు మనోజ్ పహాడీ షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆస్తుల విషయంలో ఏర్పడ్డ విభేదాలతోనే గొడవలు జరుగుతున్నట్టు తెలుస్తున్నది. జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసం వద్ద మోహన్‌బాబు, మనోజ్ తరఫున మోహరించిన అనుచరులు, బౌన్సర్ల వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. కుటుంబ వివాదాన్ని పరిష్కరించుకునేందుకు మోహన్‌బాబు మాదాపూర్‌లో తెలిసిన వ్యక్తి వద్ద పరిష్కరించుకుంటున్నారని ప్రచారం జరిగింది. మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మి కూడా జల్‌పల్లిలోని ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో మాట్లాడి వెళ్లారు. సోమవారం సాయంత్రం మోహన్‌బాబు కుమారుడు మనోజ్, కోడలు మౌనికపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం ముదిరినట్టు స్పష్టమైంది.

మోహన్‌బాబు ఫిర్యాదులో ఏముంది?

రంగారెడ్డి జిల్లా జల్‌పల్లిలోని మంచు టౌన్ షిప్‌లో తాను పదేండ్లుగా నివాసముంటున్నాని మోహన్‌బాబు తన ఫిర్యాదులో తెలిపారు. తన చిన్న కొడుకు మనోజ్, కోడలు మౌనిక అనుచరులతో వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వెల్లడించారు. తన 7 నెలల కూతురిని వదిలేసి మనోజ్ అతని భార్య బయటకు వెళ్లిపోతారని, ఆ పాపను ఇంట్లో పనిచేసే మహిళనే సంరక్షకురాలిగా ఉంటుందని వెల్లడించారు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో మనోజ్, 30 మంది అనుచరులు దౌర్జన్యంగా ఇంట్లోకి చొరబడ్డారని, ఇంట్లో ఉన్నవారిని బెదిరించి ఇల్లు ఖాళీ చేయాలంటూ భయపెట్టారని పేర్కొన్నారు. తన ఆస్తులను కాజేసేందు కు మనోజ్ కుట్ర చేస్తున్నారని, తనకు ప్రా ణహాని ఉందని, తనకు, తన ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు.

మనోజ్ ఫిర్యాదులో ఏముంది?

ఈ నెల 8వ తేదీన ఉదయం సమయంలో గుర్తుతెలియని పది మంది వ్యక్తులు తన ఇంట్లోకి ప్రవేశించి అరుపులు, కేకలు వేశారని, అడ్డుకోబోయిన తనపై దాడి చేసి పరారయ్యారంటూ మనోజ్ సోమవారం పహడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దవాఖానలో చికిత్స చేయించుకున్నానని, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మాజీ సర్పంచులపై సర్కారు దమనకాండ

- అసెంబ్లీ ముట్టడికి వస్తుండగా ఎక్కడికక్కడ అరెస్టులు
- ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై సర్పంచుల జేఏసీ ఆగ్రహం
- నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరిక
- బిల్లులు అడిగితే అక్రమ అరెస్టులా? : హరీశ్‌రావు ఆగ్రహం

చలో అసెంబ్లీకి వచ్చిన మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసి వ్యాన్‌లో ఎక్కిస్తున్న పోలీసులు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): మాజీ సర్పంచులపై ప్రభుత్వం దమనకాండకు దిగింది. మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు చలో అసెంబ్లీకి వస్తున్నవారిని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచే వారిని రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఎక్కడికక్కడే నిర్బంధించారు. రహదారులపై చెక్‌పోస్టులు పెట్టి హైదరాబాద్‌కు వస్తున్న వారి వాహనాలను అడ్డుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మూడు, నాలుగు గంటలపాటు అదుపులో ఉంచుకొని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. సోమవారం ఉదయం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన తర్వాత శాంతియుతంగా ర్యాలీగా అసెంబ్లీకి వెళ్తున్న తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ సాయినాథ్‌గంజ్ బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శాంతియుతంగా మంత్రులకు వినతి పత్రాలు అందించేందుకు వెళ్తున్నవారిపై జులుం ప్రదర్శించడమేమిటని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ప్రశ్నించారు. బిల్లులు అడిగిన పాపానికి అరెస్ట్ చేయడం దుర్మార్గమని విమర్శించారు. నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే మాజీ సర్పంచుల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే భార్యాబిడ్డలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. అరస్టు అయిన వారిలో సర్పంచుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు గంటి మధుసూదన్‌రెడ్డి, మాట్ల మధు, కేశోయిన మల్లయ్య, నెమలి సుభాష్, వేపూరి జయలక్ష్మి, బొల్లం శారద, ఇటుకల కుమార స్వామి తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచులకు ఇదేనా గౌరవం?: హరీశ్‌రావు

పెండింగ్ బిల్లులు అడిగిన మాజీ సర్పంచులను అరెస్ట్ చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వేడుకుంటున్న వారిని గోస పెట్టడం ఎంతవరకు సమంజసమని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. అప్పులు తెచ్చి, భార్య పుస్తెలమ్మి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన వారిపై కక్ష సాధించడం బాధాకరమని పేర్కొన్నారు. ఐదేండ్లు నిర్విరామంగా పనిచేసి పల్లెల రూపుమార్చిన మాజీ సర్పంచులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు నిబంధనలకు విరుద్ధంగా పనులు కట్టబెట్టి మొబిలైజేషన్ బిల్లులు చెల్లించిన ప్రభుత్వం, మాజీ సర్పంచుల సమస్యలపై మొద్దునిద్ర నటిస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచుల పోరాటానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్‌స్టేషన్ ఆవరణలో నినాదాలు చేస్తున్న మాజీ సర్పంచ్‌లు

నిర్బంధంపై భగ్గుమన్న మాజీ సర్పంచ్‌లు

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబర్ 9 : పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తలపెట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి వెళ్లకుండా మాజీ సర్పంచ్‌లను పోలీసులు ఎక్కడికక్కడ కట్టడి చేశారు. కొన్నిచోట్ల ముందస్తుగా అరెస్టు చేయగా, మరికొన్ని చోట్ల హైదరాబాద్‌కు బయల్దేరుతుండగా అడ్డుకొని సాయంత్రం వరకు నిర్బంధించారు. న్యాయమైన డిమాండ్‌ను నెరవేర్చుకునేందుకు 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని తలపెడితే పోలీసులు అడ్డుకోవడమేమిటని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా రఘునాథపల్లి, ముదిగొండలో హైదరాబాద్ వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను మార్గమధ్యంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో మాజీ సర్పంచులను పోలీసులు నిర్బంధించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే గ్రామాల్లోకి వెళ్లి పడుకున్న వారిని నిద్రలేపి మరీ అదుపులోకి తీసుకొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఠాణాల్లోనే ఉంచి తర్వాత వదిలిపెట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లోని మాజీ సర్పంచులు తరలివెళ్లకుండా ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్, లక్షెట్టిపేట, కోటపల్లి, కాసిపేట, హాజీపూర్, వేమనపల్లి, మందమర్రి, నిర్మల్ జిల్లాలో ఖానాపూర్, దస్తురాబాద్, పెంబి, నర్సాపూర్(జీ) మండలాల్లోని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. కాగా మాజీ సర్పంచులు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు ప్రారంభించారు.

ప్రజా పాలనలో మాజీ సర్పంచుల అవస్థలు: పల్లా

పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగినందుకు మాజీ సర్పంచులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జైలుకు పంపిస్తున్నదని పల్లా రాజేశ్వర్‌రెడ్డి దుయ్యబట్టారు. మంత్రులు, వారి అనుచరులైన కాంట్రాక్టర్లకు రూ.వేల కోట్ల బిల్లులు వెంటనే విడుదల చేస్తున్న ప్రభుత్వం.. మాజీ సర్పంచులను మాత్రం గోస పెడుతున్నదని మండిపడ్డారు. ఆశా వర్కర్లు, మాజీ సర్పంచుల అరెస్టులతో హైదరాబాద్‌లోని పోలీస్‌స్టేషన్లన్నీ నిండిపోతున్నాయని పేర్కొన్నారు. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కన్నకొడుకుల కర్కశత్వం

తల్లిని రెండోసారి శ్మశానంలో వదిలేసిన వైనం

వృద్ధురాలితో మాట్లాడుతున్న స్థానికులు

జగిత్యాల, డిసెంబర్ 9: కనిపెంచిన తల్లిపై నలుగురు కొడుకులు కర్కశత్వం చూపిన విషాదకర ఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. జగిత్యాలలోని చిలుకవాడకు చెందిన రాజవ్వకు నలుగురు కొడుకులు. మూడోవాడైన శ్రీనివాస్ వద్ద రాజవ్వ ఉంటున్నది. 12 రోజుల క్రితం శ్రీనివాస్ తల్లిని ఆటోలో జిల్లా కేంద్రంలోని శ్మశానవాటిక వద్దకు తీసుకొచ్చాడు. సొంతంగా గది చూస్తానని.. అప్పటివరకు ఇక్కడే ఉండమని చెప్పి వెళ్లాడు. రాజవ్వకు కాలునొప్పి తగ్గకపోవడంతో అక్కడే కూర్చొని రోదిస్తున్నది. ఓ కార్యక్రమం కోసం శ్మశానానికి వచ్చిన స్థానిక మహిళలకు రాజవ్వ ఏడుస్తూ కనిపించడంతో విషయం బయటకు వచ్చింది. జిల్లా సంక్షేమశాఖ అధికారి నరేశ్ చేరుకుని రాజవ్వను దవాఖానలో చేర్పించారు. తర్వాత సఖీ కేంద్రానికి తరలించి, కొడుకులకు కౌన్సెలింగ్ ఇవ్వగా శ్రీనివాస్ ఇంటికి తీసుకెళ్లాడు. సోమవారం రెండోసారి రాజవ్వను శ్మశాన వాటికలో వదిలివేయడంతో భిక్కుభిక్కుమంటూ రోదిస్తూ కూర్చున్నది. కొడుకులపై కేసు నమోదు చేసి శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అందరిముందు ఇస్తానంటాడు.. అడిగితే ఇవ్వడు

నిధుల విషయంలో ఆర్థిక మంత్రిపై మరో మంత్రి వ్యాఖ్య

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో అందరిముందు అడిగిన వాటన్నింటికి నిధులు ఇస్తానని చెప్తారని, కానీ, ఫైలు పట్టుకొని వస్తే మాత్రం నిధులు లేవని అంటారని రహదారుల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వాపోయారు. శాసనసభలో సోమవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆయన చాంబర్‌లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలుసుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులతో వారు మాట్లాడారు. భట్టివిక్రమార్క గురించి చెప్తూ.. ఉమ్మడి రాష్ట్రంలో రోశయ్య ముఖంపైనే నిధులు లేవని చెప్పేవాడని, భట్టి విక్రమార్క మాత్రం ఇస్తామని చెప్పి ఇవ్వరని నవ్వుతూ చెప్పారు. తన సొంత గ్రామం బ్రాహ్మణవెల్లంలో నిర్మించిన ప్రాజెక్టు పూర్తికావడం తనకు జీవితకాలం ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు. దీనిపై భట్టి స్పందిస్తూ బ్రాహ్మణవెల్లం ప్రాజెక్టు పూర్తికావడంతో వెంకట్‌రెడ్డి జీవితం ధన్యమైందని చెప్పారు. ఎస్‌ఎల్‌బీసీకి కూడా రూ. 92 కోట్లు మంజూరు చేశామని, జనవరిలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆర్మూరులో జరిగిన రగడపై కోమటిరెడ్డి స్పందిస్తూ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి లేకపోవడంతో ఓడిపోయిన తమ పార్టీ అభ్యర్థి వచ్చి సమస్యలను వేదికపై నుంచి చెప్పారని, అది ప్రొటోకాల్ సమస్య కానేకాదని అన్నారు.

ఈ నెల 15,16 తేదీల్లో హాస్టళ్లలో భోజనాలు

రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారులు.. అందరూ ప్రతి నెల ఒక్కొక్క హాస్టల్‌లో భోజనం చేయాలని నిర్ణయించామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ నెల 15 లేదా 16వ తేదీల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, సీఎంతో సహ అందరూ హాస్టళ్ల బాటపడ్తారని భట్టి విక్రమార్క చెప్పారు.

అలవెన్సుల మంజూరుకు 40 వేలు డిమాండ్

ఏసీబీకి చిక్కిన ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్

మామిళ్లగూడెం, డిసెంబర్ 9: రిటైర్మెంట్ తర్వాత మరణించిన భర్త పింఛన్‌తో పాటు రావాల్సిన ఇతర అలవెన్సుల కోసం ఓ మహిళను రూ.40 వేలు డిమాండ్ చేసిన ఖమ్మం ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్‌ను సోమవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో అటెండర్‌గా పనిచేసిన మెట్ట మల్లయ్య రిటైర్మెంట్ తరువాత మరణించాడు. తనకు ఫ్యామిలీ పింఛన్ ఇవ్వాలని, అలవెన్సులను మంజూరు చేయాలని కోరుతూ అతడి భార్య ఖమ్మంలోని ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లో దరఖాస్తు చేసుకుంది. ఎన్ని రోజులు తిరిగినా పనికాలేదు. దీంతో ఆమె ఆ డిపార్ట్‌మెంట్‌లోని పెన్షన్ విభాగ సీనియర్ అకౌంటెంట్ కట్టా నగేశ్‌ను కలిసి తన బెనిఫిట్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని వేడుకున్నది. అయినా పనికాకపోవడంతో తనకు తిరిగే ఓపిక లేక తన బంధువును సదరు కార్యాలయానికి పంపింది. అతడు వెళ్లి సీనియర్ అకౌంటెంట్ నగేశ్‌ను కలువగా సుమారు రూ.4 లక్షల వరకు అలవెన్సులు వస్తాయని, అందుకుగాను రూ. 40 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వెంటనే వారు రంగంలోకి దిగారు. బాధితుల ఫోన్ నుంచి నగేశ్‌కు ఫోన్‌కాల్ చేయించి వాయిస్ రికార్డు అయ్యేలా చూశారు. ఫోన్ మాట్లాడిన క్రమంలోనూ అతడు లంచం డిమాండ్ చేశాడు. వీటి ఆధారంగా సోమవారం నగేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు.

'సీఎం' సహాయం ఐదు వేలు!

తుర్కయంజాల్, డిసెంబర్ 9: రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధిలో నివాసం ఉంటున్న రాజేందర్‌రెడ్డికి అరు నెలల క్రితం మల్లారెడ్డి నారాయణ దవాఖానలో స్టంట్ వేశారు. డిశ్చార్జ్ అయిన తరువాత సీఎం సహాయనిధి కోసం రూ.లక్షా10 వేల బిల్లులను సమర్పించారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. రాజేందర్‌రెడ్డి చెక్కుపై గల రూ.5000 చూసి ఆశ్చర్యానికి లోనయ్యాడు. ఖర్చు చేసిన వాటిలో సగం నగదైనా సీఎం సహాయనిధి ద్వారా అందుతుందని ఆశించగా కేవలం రూ.5000 చెక్కును అందించడంపై తీవ్రనిరాశకు లోనయ్యాడు. చెక్కును తిరిగి తీసుకోవాలని అధికారులను కోరినా వారు పట్టించుకోవడం లేదని వాపోయారు.

చెన్నమనేని పౌరసత్వం పిటిషన్ కొట్టివేత

15 ఏళ్ల వివాదానికి తెర దించిన హైకోర్టు

చెన్నమనేని రమేశ్

హైదరాబాద్, డిసెంబర్ 9, (నమస్తే తెలంగాణ): వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు సోమవారం హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ఆయన భారత పౌరసత్వాన్ని రద్దు చేస్తూ 2019లో కేంద్రం జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు సమర్థించింది. చెన్నమనేని జర్మనీ పౌరసత్వం కలిగి ఉన్నారన్న కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులతో ఏకీభవించింది. పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్రం జారీచేసిన ఉత్తర్వులపై చెన్నమనేని రమేశ్ 2019లో దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కోర్టును తప్పుదోవ పట్టించినందుకు రూ.30 లక్షలు జరిమానా విధించింది. ఇందులో రూ.25 లక్షలను గత 15 ఏళ్లుగా న్యాయ పోరాటం చేస్తున్న పిటిషనర్, ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు అందించాలని, మరో రూ.5 లక్షలు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థకు చెల్లించాలని తీర్పు చెప్పింది.

ఇదీ నేపథ్యం..

భారత పౌరసత్వం కోసం చెన్నమనేని 2008లో దరఖాస్తు చేసుకున్నారు. 2009 ఫిబ్రవరిలో పౌరసత్వం పొందారు. రూల్స్ ప్రకారం ఇలా దరఖాస్తు చేసుకోవడానికి ముందు 12 నెలలు దేశంలో నివాసం ఉండాలి. కానీ, చెన్నమనేని 96 రోజులే ఉన్నారని పిటిషనర్ శ్రీనివాస్ కేంద్రానికి ఫిర్యాదు చేశారు. దీంతో కేంద్రం 2017లో ఆయన పౌరసత్వాన్ని రద్దుచేసింది. దీనిపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. పౌరసత్వం చట్టంలోని అన్ని అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు అప్పుడు కేంద్రాన్ని ఆదేశించింది. తిరిగి 2019 నవంబరు 20న చెన్నమనేని పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్రం రెండోసారి నిర్ణయం తీసుకుంది. దీనిని సవాల్ చేసి స్టే ఉత్తర్వులతో ఎమ్మెల్యేగా కొనసాగారు. ఇప్పుడు తీర్పు వెలువడింది.

హైకోర్టు తీర్పు ఆక్షేపణీయం: చెన్నమనేని రమేశ్

'నా పౌరసత్వంపై హైకోర్టు ఇచ్చిన తీర్పు నిరాశపరిచింది..ఈ జడ్జిమెంట్ హేతుబద్ధంగా లేదు' అంటూ వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ఆక్షేపించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. 2019లో తెలంగాణ హైకోర్టు పౌరసత్వ చట్టంలోని 10.3ను తు.చ. తప్పకుండా అమలుచేయాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖను ఆదేశించిందని గుర్తుచేశారు. ప్రస్తుత తీర్పుపై ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేసే విషయాన్ని తన న్యాయవాదులు పరిశీలిస్తున్నారని తెలిపారు. తాను రాజకీయాల్లో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్నానని, ఇప్పుడు కూడా అదేవిధంగా ముందుసాగుతానని స్పష్టంచేశారు. వరుస ఓటములు జీర్ణించుకోలేని వారు ఆక్రోశంతోనే ఈ కేసులు వేశారని ఆరోపించారు. ఏదేమైనా తన ప్రాంతాభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

28వ సారి! రేపు ఢిల్లీకి సీఎం రేవంత్

క్యాబినెట్ విస్తరణపై అధిష్ఠానంతో చర్చించే అవకాశం

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ నెల 11 నుంచి 13 వరకూ రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. ప్రత్యేక విమానంలో బుధవారం ఉదయం జైపూర్ వెళ్లి, వారి బంధువుల వివాహంలో పాల్గొననున్నారు. అనంతరం అటునుంచి ఆయన ఢిల్లీ వెళ్లనున్నారని సీఎంవో వర్గాలు తెలిపాయి. ఏడాది కాలంలో రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లటం ఇది 28వ సారి. నామినేటెడ్ పోస్టుల భర్తీ, క్యాబినెట్ విస్తరణ తదితర అంశాలపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం మాట్లాడనున్నారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. కాగా క్యాబినెట్ విస్తరణపై సీనియర్ కాంగ్రెస్ నేతలు, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఏకాభిప్రాయం కుదరటం లేదని ప్రచారం జరుగుతున్నది. రేవంత్‌రెడ్డి వలస కాంగ్రెస్ నేతలకు ఎక్కువ పదవులు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుండగా.. పాత కాపులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే సీఎం వలస నేతల పేర్లు ఢిల్లీకి సిఫారసు చేయగా.. హైకమాండ్ తిరస్కరించినట్టు సమాచారం. ఈసారైనా ఢిల్లీ టూర్‌తో మంత్రివర్గ విస్తరణపై సస్పెన్స్‌కు తెరపడుతుందా? అన్న చర్చ జరుగుతున్నది.

రాజ్యసభ అభ్యర్థిగా ఆర్ కృష్ణయ్య

ఏపీ నుంచి ప్రకటించిన బీజేపీ

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మరోసారి రాజ్యసభ ఎన్నికల బరిలో నిలువనున్నారు. ఏపీ నుంచి రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. మూడు రాష్ట్రాలకు సంబంధించిన రాజ్యసభ అభ్యర్థుల జాబితాను బీజేపీ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్ కృష్ణయ్య, హర్యానా నుంచి రేఖా శర్మ, ఒడిశా నుంచి సుజీత్‌కుమార్‌ను అభ్యర్థులుగా ప్రకటించింది. గతంలో వైసీపీ తరఫున దాదాపు రెండేండ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందగా, కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆర్ కృష్ణయ్యతో బీజేపీ, కూటమి నేతలు చర్చలు జరిపారు. దీంతో ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయగా, మరోసారి బీజేపీ నుంచి రాజ్యసభ ఎన్నికల బరిలో దిగుతున్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై 'పంచాయతీ'!

- నిరసన పథంలో కార్యదర్శులు
- కలెక్టర్లు, డీపీవోలకు వినతిపత్రాలు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): పనిభారంతోపాటు సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం వహిస్తుండడంతో పంచాయతీ కార్యదర్శులు భగ్గుమంటున్నారు. మంత్రులు, ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ నిరసనకు ఉపక్రమించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు దూరంగా ఉన్నారు. టీపీఎస్‌ఎఫ్(తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్), టీపీఎస్‌సీఎఫ్(తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ సెంట్రల్ ఫోరం) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సోమవారం ఉదయం జూమ్ మీటింగ్‌లో నిర్ణయించిన మేరకు కలెక్టర్లు, డీపీవోలు, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు.

అదనపు భారంతో సతమతం..

ప్రతిరోజూ ఉదయం తొమ్మిదిగంటల వరకు గ్రామాలకు చేరుకొని రెండు రోడ్లు, రెండు డ్రైనేజీలను సందర్శించి ఫొటోలు అప్‌లోడ్ చేయడం, మరో రెండు నర్సరీలు, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలకు వెళ్లాల్సి ఉంటుందని కార్యదర్శులు చెప్తున్నారు. మొన్నటివరకు కుల గణన సర్వేలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించామని, ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల సర్వే, యాప్ అప్‌లోడ్ బాధ్యతలు అప్పగించడంతో ఒత్తిడికి గురవుతున్నామని వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరమైనా.. ఎన్నికల ముందు తమకిచ్చిన హామీల అమలుపై దృష్టిపెట్టడం లేదని ఆరోపిస్తున్నారు.

విభజన సమస్యలపై ఏపీ తిరకాసు

- అన్ని అంశాల్లో పైచేయి సాధించే యత్నం
- కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కిమ్మనని వైనం
- ఇప్పుడు దబాయింపు ధోరణి

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజనకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పైచేయి సాధించాలని చూస్తున్నది. తెలంగాణ సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు కిమ్మనని ఏపీ.. ఇప్పుడు అన్ని అంశాలపై పట్టు బిగించేందుకు ప్రయత్నిస్తున్నది. ఉమ్మడి ఆస్తుల్లో వాటాలు, ఉద్యోగుల పంపిణీలో తలెత్తిన ప్రతిష్టంభన కొలిక్కిరాలేదు. ఇటీవల తెలంగాణ అధికారులు విజయవాడకు వెళ్లి ఏపీ ప్రభుత్వంతో జరిపిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. ఆ సమావేశంలో ఏపీ ప్రభుత్వం గతానికి భిన్నంగా తెలంగాణపై పైచేయి సాధించేందుకు ప్రయత్నించినట్టు తెలిసింది. గతంలో తెలంగాణ నుంచి వచ్చిన ప్రతిపాదనలపై ఏపీ అధికారులు కొంత వెనక్కి తగ్గేవారని, ఈ సారి ఏపీ అధికారులు అడుగడుగునా దబాయింపు ధోరణి ప్రదర్శించారని ఆ సమావేశానికి హాజరైన ఓ కీలక అధికారి వెల్లడించారు. విద్యుత్తు సంస్థల విభజన, నిధుల పంపకంపై జరిగిన చర్చల్లో తెలంగాణకు ఇవ్వాల్సిన 20వేల కోట్లకుపైగా నిధుల గురించి ఏపీ మాట్లాడకుండా తనకు రావాల్సిన 3 వేల కోట్ల గురించి మాత్రమే అడిగినట్టు తెలిపారు. ఆర్టీసీ ఆస్తుల విభజనను తేల్చని ఏపీ.. సింగరేణిలో వాటా లేకపోయినా పూర్తిస్థాయి వాటా కావాలని పట్టుపట్టినట్టు చెప్పారు. సింగరేణికి సంబంధించిన 'ఆప్మెల్' ఏపీకే కావాలని అడగడంతోపాటు దానిపై తెలంగాణకు హక్కు లేదన్నట్టుగా వాదించిందని, ఉద్యోగుల విభజన సందర్భంగా ఏపీకి కేటాయించిన వారిలో దాదాపు 1,400మంది తెలంగాణకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పిందని తెలిపారు. వీరంతా గెజిటెడ్ పోస్టుల్లో ఉన్నవాళ్లేనని, ఒకవేళ వీరిని తీసుకుంటే తెలంగాణ వాళ్లకు పదోన్నతులు లభించవని స్పష్టంచేశారు. నాలుగో, మూడో తరగతి ఉద్యోగులతోపాటు నాన్-గెజిటెడ్ ఉద్యోగులకు సంబంధించి ఏపీ చేసిన ప్రతిపాదనలకు తెలంగాణ అధికారులు సానుకూలంగా స్పందించినప్పటికీ గెజిటెడ్ ఉద్యోగుల విషయం తేలలేదని తెలిసింది.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీలో అవకతవకలు!

వికారాబాద్, డిసెంబర్ 9, (నమస్తే తెలంగాణ): పల్లె, బస్తీ దవాఖానాల్లో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) పోస్టుల భర్తీలో అవకతవకలపై వికారాబాద్ జిల్లాలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో పోస్టుకు లక్షల్లో బేరసారాలు జరిగినట్టు తెలుస్తున్నది. ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల ఎంపిక జాబితాతోపాటు తుది జాబితాను ఆన్‌లైన్‌లో పొం దుపర్చిన సంబంధిత అధికారులు పోస్టుల ఖాళీల వివరాలను గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని 25 పోస్టుల భర్తీకిగాను 140 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంపిక జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతోపాటు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయా ఖాళీల్లో పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా, కౌన్సెలింగ్‌ను వాయిదా వేయాలని కలెక్టర్ ఆదేశించినట్టు డీఎంహెచ్‌వో కార్యాలయం తెలుపడంతో అభ్యర్థులు వెళ్లిపోయారు. అవకతవకలు తెలిసి వాయిదాకు ఆదేశించారా?.. ఇతర కారణాలతోనా అనే దానిపై చర్చ జరుగుతున్నది.

అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీ పెద్దలు, ఆదివాసులు

లంబాడాల ఎస్టీ హోదా రద్దు చేయాలి

ఇంద్రవెల్లి, డిసెంబర్ 9 : ఏజెన్సీ ప్రాంతానికి అక్రమంగా వలస వచ్చి చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ మైపతి అరుణ్ కుమార్, గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు డిమాండ్ చేశారు. ఏజెన్సీలో మైనార్టీలను మైదాన ప్రాంతాలకు తరలించాలని, లేనిపక్షంలో ఏప్రిల్ 10వ తేదీ నుంచి అమరవీరుల స్ఫూర్తితో మరో పోరాటం చేస్తామని హెచ్చరించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ, గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ ఆధ్వర్యంలో ఆదివాసీ అస్తిత్వ పోరు గర్జన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్టీ జాబితాలో అక్రమంగా చేరిన లంబాడాలను కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. 1970 తరువాత జైనూర్ మండలంలో వలస వచ్చిన మైనార్టీలను ఇతర ప్రాంతంతోపాటు మైదాన ప్రాంతానికి తరలించాలని సూచించారు. జైనూర్ ఘటనలో ఆదివాసీలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమన్వయ కర్త సిడాం భీంరావ్ , సార్‌మేడిలు మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, తుంరం జుగాదిరావ్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.